# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భారత్ పోలాండ్ దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.**
2. **అచ్యుతాపురం పారిశ్రామిక ప్రాంతంలో ప్రమాద ఘటనపై విచారణ కమిటీ ఏర్పాటు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో సముద్ర విమానాలు సీ-ప్లేన్ విధానాలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు.**
4. **రాష్ట్రంలో ఉర్దూ మాధ్యమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఆంధ్రప్రదేశ్ మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ అన్నారు.**
5. **తెలంగాణలో గ్రూప్-2 పరీక్షల షెడ్యూల్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది.**
6. **దేశ వ్యాప్తంగా ఈరోజు మొట్టమొదటి జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.**

==========================

భారత్ పోలాండ్ దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. నిన్న వార్సాలో పోలాండ్ ప్రధానమంత్రి డొనాల్డ్ టస్క్‌తో ప్రతినిధి స్థాయి చర్చల అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విలేకరులతో మాట్లాడుతూ... భారతదేశం-పోలాండ్ సంబంధాలు ప్రజాస్వామ్యయుతమైన చట్టబద్ధమైన పాలన వంటి విలువలపైన ఆధారపడి న్నాయని గుర్తు చేశారు. 2022లో ఉక్రెయిన్ – రష్యా యుద్ధం సమయంలో భారతీయ విద్యార్థులను రక్షించడంలో పోలాండ్ అందించిన సహాయాన్ని భారతదేశ ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరని అన్నారు. ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలలో సంస్కరణలు అవసరమని తెలిపారు. శాంతి, స్థిరత్వం పునరుద్ధరణ కోసం దౌత్యపరమైన చర్చలకే భారత్ మద్దతు ఇస్తుందని అన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం పారిశ్రామిక ప్రాంతంలో రియాక్టర్ పేలుడు ఘటనపై ఉన్నత స్థాయి విచారణ కమిటీ ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అచ్యుతాపురంలో ప్రమాదం చోటు చేసుకున్న ఫార్మా పరిశ్రమను ముఖ్యమంత్రి నిన్న పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా బాధ్యులపైన చర్యలు తీసుకుంటామన్నారు,

మృతి చెందిన వారి కుటుంబాలకు కోటి రూపాయలు, తీవ్రంగా గాయపడిన వారికి 50 లక్షల రూపాయలు, గాయపడిన వారికి రూ.25లక్షలు ఆర్థిక సాయం ప్రకటించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని పరిశ్రమలలో భద్రతాపరమైన చర్యలను శాశ్వత ప్రాతిపదికన చేపడతామని తెలిపారు. పరిశ్రమలలో భద్రతాపరమైన తనిఖీ తప్పనిసరి అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో సముద్ర విమానాలు సీ ప్లేన్ విధానాలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఢిల్లీలోని జాతీయ ఏవియేషన్ అకాడమీలో నిన్న జరిగిన ఓ కార్యక్రమంలో సీ ప్లేన్ సమగ్ర మార్గదర్శకాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. సీ ప్లేన్ విధానం ద్వారా ప్రయాణం మరింత సులభతరంగా మారుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, విశాఖపట్నం, కాకినాడ, నర్సాపురం తదితర సువిశాల తీర ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. శ్రీశైలం, ప్రకాశం బ్యారేజి, రాజమహేంద్రవరం, నాగార్జునసాగర్ వంటి నదీ పరివాహక ప్రాంతాల్లో సీ ప్లేన్ విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఉర్దూ మాధ్యమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యనిస్తోందని రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో సమగ్రశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉర్దూ ద్విభాష పాఠ్యపుస్తకాల రూపకల్పన ఆరు రోజుల కార్యశాలలో మంత్రి నిన్న పాల్గొని మాట్లాడుతూ, పాఠశాల స్థాయి నుంచే ఉర్దూభాషకు ప్రాధాన్యం ఇస్తూ భాషాభివృద్ధికి సమగ్రశిక్షా అభియాన్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఉర్దూ భాషాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోదని చెప్పారు. ఉర్దూ మాధ్యమంలో బోధన, ఉపాధ్యాయుల నియామకాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

---------------------------

తెలంగాణలో గ్రూప్–2 పరీక్షల షెడ్యూల్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ – టీజీపీఎస్సీ నిన్న విడుదల చేసింది. డిసెంబర్ 15, 16 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఉదయం, మధ్యాహ్నం 2 విడతల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది. కాగా మొత్తం 783 గ్రూప్– 2 పోస్టుల భర్తీకి ఈ నెల 7, 8 తేదీల్లో పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు వాయిదా వేశారు. దీంతో గ్రూప్–2 పరీక్షల కొత్త షెడ్యూల్‌ను ప్రకటించారు. తెలంగాణలో గ్రూప్ –2 ఉద్యోగాలకు 5.51లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

---------------------------

తెలంగాణలో రేషన్‌కార్డు దారులందరికీ వచ్చే ఏడాది జనవరి నుంచి సన్న రకం బియ్యం పంపిణీ చేయనున్నట్టు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో నిన్న జరిగిన రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశానికి రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పౌరసరఫరాలశాఖకు సంబంధించిన కార్యకలాపాలపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన బియ్యం వినియోగదారులకు అందించడం ప్రాధాన్యత అని వివరించారు. అవసరమైన చోట రాయితీ ధరలకు గోధుమలు కూడా సరఫరా చేయాలని కూడా అధికారులను ఆదేశించారు.

రేషన్ బియ్యం దారి మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

---------------------------

దేశ వ్యాప్తంగా ఈరోజు మొట్టమొదటి జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. "చంద్రమండలాన్ని తాకుతూ జీవితాలను స్పృశించడం... భారత అంతరిక్ష గాథ" అనే ఇతివృత్తంతో ఈ ఏడాది అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 2023 ఆగష్టు 23 న చంద్రయాన్- 3 యాత్ర విజయవంతంగా ముగించి, విక్రమ్ ల్యాండర్ చంద్రునిపై సురక్షితంగా దిగింది. దీంతో భారత్ చంద్రునిపై కాలు మోపిన నాల్గవ దేశంగా, దక్షిణ ధృవం చేరిన తొలి దేశంగా ఘనత సాధించింది. అలా ల్యాండర్ దిగిన ప్రాంతానికి ఇస్రో శివ శక్తి పాయింట్‌గా నామకరణం చేశారు.. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఈరోజు పలు అంతరిక్ష అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 113వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈరోజు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాద ఘటనలో గాయపడి, అనకాపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్‌మోహన్ రెడ్డి ఈరోజు అనకాపల్లి వెళ్లనున్నారు. ఈ ఉదయం తాడేపల్లి నుంచి బయల్దేరి విశాఖకు వెళ్తారని, అక్కడ నుంచి అనకాపల్లి చేరుకొని బాధితులను పరామర్శించనున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిన్న ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈరోజు ఢిల్లీలో పర్యటిస్తారు. ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్చార్జి దీపాదాస్ మున్షీ కూడా పర్యటిస్తారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యుడిగా అభిషేక్ మను సింఘ్వీ ఏకగ్రీవ ఎంపిక, రాష్ట్రంలో గడిచిన ఎనిమిది నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ఆరు గ్యారంటీల అమలు తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

---------------------------

విశాఖపట్నం-సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ఇకపై ఏలూరు స్టేషన్‌లోనూ ఆగుతుందని దక్షిణ మధ్య రైల్వే పౌర సంబంధాల అధికారి ఎ.శ్రీధర్ నిన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 25 నుంచి వందే భారత్ రైలు ఏలూరులో కూడా ఆగుతుందని తెలిపారు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు ఏలూరులో అదనపు స్టాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

---------------------------

ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం. 1872వ సంవత్సరం ఆగష్టు 23వ తేదీన ప్రకాశం జిల్లా వినోదరాయిని పాలెంలో జన్మించిన

ఆయన... ఇంగ్లండులో బారిష్టర్ విద్యను అభ్యసించారు. కొంతకాలం మద్రాసులో న్యాయవాద వృత్తిని చేపట్టిన ఆయన 1922లో సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 1928లో మద్రాసు వచ్చిన సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా పోరాడారు. ఒక్క భారతీయుడు కూడా సభ్యుడుగాలేని సైమన్ కమిషన్ మాకు వద్దు అంటూ సైమన్ గో బ్యాక్ నినాదంతో బ్రిటీష్ అధికారులు తుపాకులకు ధైర్యంగా ఎదురువెళ్ళి 'ఆంధ్రకేసరి' అనే బిరుదును సొంతం చేసుకున్న ధీరోదాత్తుడు ప్రకాశం పంతులు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం అనుభవించిన దేశ భక్తుడు. మద్రాసు ప్రెసిడెన్సీ ముఖ్యమంత్రిగాను, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర తొలిముఖ్యమంత్రిగాను ప్రకాశం పంతులు అందించిన సేవలు చిరస్మరణీయం.

---------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నవాహ్నిక బ్రహ్మోత్సవాల సందర్భంగా పలు శ్రీవారి ఆర్జిత సేవలు, బ్రేక్ దర్శనాలు, వివిధ ప్రత్యేక దర్శనాలను రద్దు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం –టిటిడి ఒక ప్రకటనలో తెలిపింది. అక్టోబరు 3వ తేదీన అంకురార్పణం నుండి 12వ తేదీ చక్రస్నానం వరకు ప్రతి రోజు వయో వృద్ధులు, దివ్యాంగులు, చిన్న పిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనాలను రద్దు చేసినట్లు టిటిడి తెలిపింది. భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

======================